నిరసనకు అనుమతి కోరుతూ వినతి



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఓయూలో తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం ఓయూ పీఎస్‌లో పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ సంఘాల నాయకుడు సూర్యచందర్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 29 వరకు పెన్‌డౌన్, బైక్ ర్యాలీ, మహా ర్యాలీ, మానవహారం, మహాధర్నా, రిలే నిరాహార దీక్షలు రోజుకు ఒకటి చొప్పున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు.

అర్హులందరికీ 'జీరో బిల్లు'

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలోని అర్హులైన వారందరికీ 'జీరో బిల్లు' వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'కంటోన్మెంట్ వాణి'లో విద్యుత్ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యుత్‌కు సంబంధించి మొత్తం 69 ఫిర్యాదులు రాగా, వీటిలో 58 జీరో బిల్లుకు సంబంధించినవే ఉన్నాయి. దీంతో తక్షణమే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఆయా దరఖాస్తులను నేరుగా కలెక్టర్ కార్యాలయానికి పంపారు. ఇక మిగిలిన 11 దరఖాస్తులు పోల్స్, వైర్లు తరలింపునకు సంబంధించినవి ఉన్నట్లు తెలిపారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే సమీక్షలో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపయ్య, డివిజనల్ ఇంజనీర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పత్రాలు అందజేత


అడ్డగుట్ట: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని సీ– సెక్షన్ ప్రాంతానికి చెందిన సుగుణ వెన్నుపూస సంబంధిత వ్యాధితో, శాంతినగర్‌కు చెందిన మన్సూర్ అక్రమ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నారు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన వారిద్దరికీ సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయించారు. ఈ మేరకు శుక్రవారం బాధితులు సుగుణ చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు, అక్రమ్ చికిత్స నిమిత్తం రూ. 2లక్షల ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నరేష్, దేవయ్య, సంతోష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బౌద్ధనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షం తెలంగాణ 2025లో భాగంగా కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్ ఈశ్వరీబాయి నగర్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో పర్యటించి వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో హన్మంతు ముదిరాజ్, బందెల సత్యనారాయణ, శ్యామ్ ముదిరాజ్, నాగరాణి, లక్ష్మి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మల్లేశ్

అమీర్‌పేట: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన మల్లేశ్ (30) 5 ఏళ్లుగా గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఉద్యోగం లేక తీవ్ర మనస్తాపంతో హైదరాబాద్‌కి 10 రోజుల క్రితం వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలుచోట్ల ఉద్యోగం కోసం ప్రయత్నం చేసినా ఫలితం లేదు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు చార్జీలు లేకపోవడంతో చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. బీకేగూడ ఎస్‌ఆర్‌నగర్ వెంకటేశ్వర ఆలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి కరెంట్ తీగలు పట్టుకోవడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా , చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముంపునకు బాధ్యులెవరు?



ఐదోవార్డు పరిధిలో వెలిసిన అక్రమ నిర్మాణం

నాలాలను మింగేసి నిర్మాణాలు

- జరిమానాలు వేసి చేతులు దులుపుకున్న అధికారులు
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించని వైనం
- తాజా వర్షాలకు ముంపునకు గురైన సమీప బస్తీలు

కంటోన్మెంట్: నీరు పల్లమెరుగు నిజం దేవుడెరుగు అన్నట్లుగా.. వానొస్తే వరదొస్తుంది, వరద లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతుందని వాస్తవం. ఈ నేపథ్యంలో వర్షపు నీటి సహజ ప్రవాహానికి అడ్డుగా ఎలాంటి నిర్మాణాలను అనుమతించరు. అయినప్పటికీ నగర వ్యాప్తంగా ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. వర్షం కురిసిన ప్రతీసారి ముంపునకు అక్రమనిర్మాణాలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. కంటోన్మెంట్ పరిధిలోని పికెట్, హస్మత్‌పేట, ప్యాట్నీ నాలాల ఆక్రమణల కారణంగా మెజార్టీ ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. వీటికి తోడు వరద ప్రవాహానికి అడ్డుగా వెలిసిన భారీ నిర్మాణాల కారణంగా కూడా పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. వీటిపై బోర్డు అధికారులకు పదే పదే ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం. తాజాగా ఆరో వార్డు పరిధిలోని నందమూరి నగర్, ఐదోవార్డు పరిధిలోని గణేశ్ నగర్‌ల మునకకు బోర్డు అధికారుల అలసత్వం, అవి నీతే కారణం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

బాండ్‌నే ఏమార్చే ప్రయత్నం

బోయిన్‌పల్లి సర్వే నెంబర్ 33లోని సుమారు 1551 గజాల్లో ఓ వ్యక్తి, 2017లో నిర్మాణం చేపట్టేందుకు ఉపక్రమించాడు. ఈ మేరకు బోర్డుకు దరఖాస్తు చేసుకోగా, సదరు స్థలం గుండా నాలా ప్రవహిస్తుందని, నిర్మాణ అనుమతులివ్వలేమంటూ బోర్డు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నాలా ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తన స్థలం గుండా ప్రత్యేక డ్రైనేజీ లైన్ వేయిస్తానని బోర్డు అధికారులకు బాండ్ రాసి ఇవ్వడంతో అనుమతులు జారీ చేశారు. నిర్మాణం పూర్తయింది, అధికారులు మారిపోయారు. నిర్మాణదారుడు డ్రైనేజీ లైను నిర్మాణ విషయం మరిచిపోయాడు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణం వెలువడంతో, వర్షాలు కురిసిన ప్రతీసారి వెనక వైపు ఉన్న నందమూరి నగర్ బస్తీని ముంచెత్తుతుంది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేయగా, తాజాగా బోర్డు అధికారులు నిర్మాణదారుడికి నోటీసు జారీ చేశారు. ఇందుకు స్పందించిన నిర్మాణదారుడు నాలా తమ స్థలంలో కొంతే ఉందని, మిగతా నాలా తన పక్కనున్న ప్లాటు నుంచి ప్రవహిస్తుందంటూ పేర్కొంటూ మరో లేఖ రాశాడు. మొత్తానికి తాను గతంలో రాసిచ్చిన బాండ్ ప్రకారం నడుచుకోలేమంటూ చెప్పే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగానే బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మరోసారి బస్తీ నీట మునిగింది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక డ్రైనేజీ లైను వేయాలని కోరుతున్నారు.

ఆర్మీ పేరిట అక్రమ నిర్మాణం

2014లో ఏటీసీ సెంటర్ సమీపంలోని సుమారు ఐదెకరాల ప్రైవేట్ స్థలంలో ఏటీసీ రెజిమెంటల్ అసోసియేషన్ ఓ భారీ అక్రమ నిర్మాణం చేపట్టింది. ఆలస్యంగా గుర్తించిన బోర్డు అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసినా నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదు. బోర్డు అధికారులు పదే పదే నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో కూల్చివేతకు సిద్ధపడ్డారు. దీంతో ఆర్మీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో 2019లో క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చారు. ఈ స్థలం గుండా పారే మూడు చిన్నపాటి నాలాల గమనాన్ని మరల్చిన విషయాన్ని గుర్తించి, ప్రత్యేక డ్రైనేజీ లైను వేయాల్సిందిగా డిమాండ్ చేశారు. క్రమబద్ధీకరణ జరిమానాతో పాటు నాలాల పునరుద్ధరణకు రూ.కోటి చెల్లించాలని ప్రతిపాదించారు. అయితే ఏటీసీ రెజిమెంటల్ అసోసియేషన్ ప్రతినిధులు కేవలం రూ.50 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ బోర్డు అధికారులు డ్రైనేజీ లైనును పునరుద్ధరించలేదు. దీనిపై సమీపంలోని గాంధీనగర్, దుర్గాగార్డెన్స్, గణేశ్ నగర్, హనుమంతరావు గార్డెన్స్, వెల్లింగ్టన ఎన్‌క్లేవ్ వాసులు ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నా బోర్డు అధికారులు స్పందించడం లేదు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నాలా ఉప్పొంగి గణేశ్ నగర కాలనీ కాంపౌండ్ వాల్ కూలి కాలనీని ముంచెత్తింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నందమూరినగర్‌లో నాలా ప్రవాహానికి అడ్డుగా వెలిసిన నిర్మాణం



నందమూరి నగర్ బస్తీని ముంచెత్తిన వరద నీరు

ఆంధ్ర నాటక పరిషత్ వార్షిక నాటకోత్సవాలు

అమీర్‌పేట: అమీర్‌పేట కమ్మ సంఘంలో ఆంధ్ర నాటక పరిషత్ 96వ వార్షిక నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సమావేశంలో కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాటక దర్శకులు అన్నమనేని ప్రసాద్ వివరాలను తెలిపారు. తెలుగు భాష సాంస్కృతిక శాఖ, అమీర్‌పేట కమ్మం సంఘం, తెలంగాణ ఫిలీం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో నాటకోత్సవాలు జరుపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కమ్మ సంఘం ప్రతినిధులు, కళాకారులు బుర్ర నరేష్, విజయ్‌బాబు, శ్రీనివాస్‌రావు, విజయ్ పాల్గొన్నారు.

చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జగన్‌రెడ్డి



బన్సీలాల్‌పేట్: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బి. జగన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాసులు బదిలీ అయ్యారు. సంతోష్‌నగర్ పోలీసు స్టేషన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన జగన్‌రెడ్డి బదిలీపై చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్దిష్టమైన కార్యచరణతో ముందుకు సాగనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది శ్రద్ధతో ట్రాఫిక్ విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ముంపునకు గురైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్



లోతట్టు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్

బౌద్ధనగర్: ముంపునకు గురైన ప్రాంతాల నిర్వాసితులను ప్రభుత్వం ఆహార పదార్థాలు, వంట సామగ్రి అందించి ఆదుకోవాలని డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75 ఏళ్ల జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన సేవా పక్షం కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రారంభించారు. ఎల్. నారాయణనగర్, పార్శీగుట్ట, న్యూ అశోక్‌నగర్ బస్తీల్లో పాదయాత్ర చేస్తూ స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాలా పరివాహక ప్రాంతాల్లో వర్షపునీరు చుట్టుపక్కల ఇళ్లలో చేరి బియ్యం , పప్పు దినుసులు, పుస్తకాలు, వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు పూర్తిగా తడిసిపోయాయన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ, హైడ్రా, మలేరియా సిబ్బందితో కలిసి ఈ ప్రాంతాన్ని శుభ్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్, దత్తు, మద్దెర్ల శ్యాంసుందర్, సుధాకర్‌లడ్డు, కుమార్, లింగం, బబ్లు, నాగరాజు, వెంకటేష్, జయంత్, సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

బౌద్ధనగర్: స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ కంది శైలజ ప్రజలకు సూచించారు. శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో ఆమె డీసీ ఆంజనేయులుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ... ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఈ తిరుపతి, ఏఈ లావణ్య, శానిటేషన్ డీఈ వెంకటేష్, హైడ్రా సిబ్బంది, సికింద్రాబాద్ ఇన్‌చార్జి మార్షల్ సుబ్బయ్య, సీఓ వరుణ, బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్, పాకసాయి, వినోద్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని యువతీ, యువకులకు కంప్యూటర్, ఏఐ టూల్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం టెక్ మహీంద్రా సిబ్బంది చాచానెహ్రూనగర్, బన్సీలాల్‌పేట్ తదితర బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ తల్లిదండ్రులు, విద్యావంతులైన నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొగ్రామ్ మేనేజర్ షేక్ మౌలా మాట్లాడుతూ.. నిరుద్యోగులకు కంప్యూటర్, ఏఐ టూల్స్ ఇతరత్రా కోర్సుల్లో పేద, మధ్య తరగతి యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 27 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్, డీగ్రీ ఫెయిల్ అయిన యువతకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి అన్ని విధాలా తీర్చిదిద్దుతామన్నారు. ఆసక్తిగల వారు బోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లోని అప్స-టెక్‌మహీంద్రా స్మార్ట్ శిక్షణా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 90324 69995, 91509 90133 సంప్రదించాలన్నారు.

బల్కంపేట అండర్ పాస్ బ్రిడ్జి వద్ద లైట్ల ఏర్పాటు

అమీర్‌పేట: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో బల్కంపేట అండర్ పాస్ బ్రిడ్జి వద్ద లైట్లను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్‌కు చెందిన షరీఫుద్దీన్ వరదనీటిలో మునిగిపోయి మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గురువారం సంఘటన స్థలాన్ని సందర్శించి సమస్యపై ఆరా తీశారు. ప్రధానంగా వెలుతురు లేని కారణంగా రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వివరించారు. వరదనీరు వచ్చిన సమయంలో తెలియకుండా వెళ్లి నీటి మునిగిపోతున్న ఘటనలు గతంలో కూడా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అక్కడే ఉన్న అధికారులను పిలిచి వెంటనే లైట్లు ఏర్పాటు చేసి బ్రిడ్జి కింద నిరంతరం వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీమ్‌కార్‌నగర్ వైపు ఉన్న రిటర్నింగ్ వాల్ గోడ కూలిపోయి రోడ్డుపైకి వచ్చిన పెద్ద పెద్ద రాళ్లను తొలగించాలని సూచించగా శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు.



బాధితులకు ఆహారం పంపిణీ

సనత్‌నగర్: భారీ వర్షాల కారణంగా జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో శుక్రవారం ఆహారం, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా బేగంపేట డివిజన్ పరిధిలోని బ్రాహ్మణవాడీలో వరద ముంపునకు గురైన ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం వారికి ఆహారం, మంచినీటిని అందించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, కూన గౌరీశంకర్‌గౌడ్, రమేష్, సలీంఖాన్, హోసీటోచర్, హనీఫ్‌ఖాన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

సికింద్రాబాద్: రైలులో గంజాయి రవాణా చేస్తున్న ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే, ఈగల్ టీం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.10.72 లక్షల విలువ చేసే 21.44 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.. అరకు వ్యాలీ మండలం బొండామ్ గ్రామానికి చెందిన శివ (20) వ్యవసాయ కూలీ. రెండేళ్ల క్రితం కంచెర్లపాలెంలో గంజాయి వ్యాపారి అనంతగిరి వాస్తవ్యుడు విజయ్‌చంద్రతో పరిచయం ఏర్పడింది. అతడితో పాటు ఒడిశా బరంపూర్‌కు చెందిన ఆశీష్‌కుమార్ సహకారంతో గంజాయి ప్యాకెట్లను తీసుకొని విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. సికింద్రాబాద్ చేరుకున్న రైలును పోలీసులు తనిఖీ చేయగా, గంజాయి రవాణా వ్యవహారం వెలుగుచూసింది. నిందితుడిపై కేసులు నమోదు చేశారు. గంజాయి వ్యాపారానికి సూత్రధారులుగా ఉన్న విజయ్‌చంద్ర, ఆశీష్‌కుమార్‌లపై కేసులు నమోదు చేసి, వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లిపై దాడి చేసిన కుమారుడుకి జైలు శిక్ష

బన్సీలాల్‌పేట్: తాగిన మత్తులో తల్లిపై దాడి చేసిన కేసులో కుమారుడికి కోర్టు 10 రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువర్చింది. గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, ఎస్.ఐ హరీశ్ కథనం ప్రకారం.. బోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన నాచారం తారకరామారావు(40)కి తల్లిపై దాడి చేసిన కేసులో 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శుక్రవారం 10 రోజుల జైలు శిక్ష విధించారని చెప్పారు. దీంతో పోలీసులు నిందితున్ని జైలుకు తరలించారు. గాంధీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డీసీపీ కల్పవల్లి మాట్లాడుతూ తల్లిదండ్రులపై దాడిని, హింసను సహించబోమన్నారు.

సంఘటన స్థలం పరిశీలన

అమీర్‌పేట: హైదరాబాద్ మహానగర్‌లో భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు క్లీయర్ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ తెలిపారు. బల్కంపేట ఆండర్ పాస్ బ్రిడ్జి వద్ద వరద నీటిలో కొట్టుకుపోయి షరీఫుద్దీన్ అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

సికింద్రాబాద్: ఎనమిదవ వేతన సంఘం ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా శుక్రవారం భారతీయ రైల్వే ఫెడరేషన్, రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపుతో ఉద్యోగులు నిరసన చేశారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని 33 బ్రాంచి కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రవీందర్, స్థానిక బ్రాంచీల కార్యదర్శి శ్రీనయ్య, యూనియన్ నాయకులు వినాయకరావు, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమ చట్టం చేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్పన



గృహ కార్మికులతో మాట్లాడుతున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన

అడ్డగుట్ట: గృహ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. శుక్రవారం తుకారాంగేట్ సాయినగర్‌లో గృహ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అందక శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. కనీస వేతనాలు అందకపోవడంవల్ల ఇంటి రెంట్, పిల్లల చదువులు, కుటుంబ పోషణభారంగా మారిందన్నారు. భారత రాజ్యాంగం, కనీస వేతనాల చట్టం ప్రకారం అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అందించే బాధ్యత ప్రభుత్వాలది అని అన్నారు. గృహ కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా కార్మికులకు న్యాయం జరుగుతది అని అన్నారు. వారంలో ఒకరోజు సెలవు ఇవ్వాలని, వారికి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారా రాజ్యాంగ హక్కులను కాపాడుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమా, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

ఔషధ దుష్ప్రభావాలపై అవగాహన



ఔషధ భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ పాలనయంత్రాంగం, వైద్యులు


గాంధీఆస్పత్రి: ఔషధ దుష్ప్రభావాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అన్నారు. ఐదవ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గాంధీ ప్రాంగణంలో ఫార్మాకో విజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీ భద్రత ఒక్క క్లిక్ దూరంలో పీవీపీఐకి రిపోర్ట్ చేయండి ఈ ఏడాది నినాదంలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఔషధాల భద్రత, డోసేజ్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, ఫార్మకాలజీ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

లాలాపేట: సేవా కార్యక్రమాల పేరుతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ 320 బీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సామాజిక కార్యకర్త స్పెన్సర్ లాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. క్లబ్‌లో నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించినందుకు లయన్స్ క్లబ్ నుంచి ఓ మహిళా సభ్యురాలిని బైలాస్‌కు విరుద్ధంగా తొలగించారని ఆరోపించారు. ఈ విషయమై లయన్స్ క్లబ్‌లో ఉన్న సీనియర్ సభ్యులైన టి. రాజేంద్రప్రసాద్, వీణా సరస్వతి, విజయ్ కుమార్ శెట్టి, సల్వసాయి రామరాజు, లింగమూర్తి, అబాన్ ఇచాపోరియా తదితరులపై సికింద్రాబాద్ కోర్టులో ప్రైవేట్ క్రిమినల్ కేసు వేశారన్నారు. ఆ వ్యక్తులపై పోలీసు కేసులు సైతం నమోదు అయ్యాయన్నారు. లయన్స్ క్లబ్‌లో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే క్లబ్ నుంచి తొలగించాలన్నారు. లేనిచో సికింద్రాబాద్ లయన్స్ భవన్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన మహిళా అభ్యర్థికి న్యాయం చేయాలని సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను కోరారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి

సనత్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే రావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పలు ఆలయాల నుంచి ఆహ్వానాలు అందాయి. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. అమీర్‌పేటలోని హనుమాన్ దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయం, పద్మారావునగర్‌లోని పోల్ బాల్ హనుమాన్ దేవాలయాల అధికారులు కూడా దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆయా ఆలయాల అధికారులు నరేందర్‌రెడ్డి, జయంతి, అంబుజ, మల్లికార్జునప్ప, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, అశోక్‌యాదవ్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు